క్లుప్తంగా

సూపర్ సిక్స్‌పై జెడ్పీటీసీని నిలదీసిన సర్పంచ్

నర్సీపట్నం: సూపర్ సిక్స్ పథకాలపై జెడ్పీటీసీ సుకల రమణమ్మను సర్పంచ్ గొంప కన్నయ్య నాయుడు నిలదీశారు. మండలంలో శుక్రవారం ధర్మసాగరంలో శుక్రవారం పల్లెపండగ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ అభివృద్ధి టీడీపీ హయాంలోనే జరిగిందని జెడ్పీటీసీ రమణ పేర్కొనడంతో, అభివృద్ధి కార్యక్రమంలో రాజకీయాలు చేయడం సరికాదని గ్రామ సర్పంచ్ కన్నయ్యనాయుడు అన్నారు. ఎవరి ప్రభుత్వంలో గ్రామం అభివృద్ధి చెందిందో ప్రజలకు తెలుసునని సర్పంచ్ తెలిపారు. దీంతో సర్పంచ్, జెడ్పీటీసీ మధ్య వాగ్వాదం నెలకొంది. సూపర్‌సిక్స్ పథకాలు ఇస్తామని ప్రజలచే ఓట్లు వేయించుకుని,ఎందుకు ఇవ్వలేదో గ్రామస్తులకు సమాధానం చెప్పాలని జెడ్పీటీసీని సర్పంచ్ నిలదీశారు. అభివృద్ధి కార్యక్రమాల్లో రాజకీయాలు మాట్లాడడం మానుకోవాలని సర్పంచ్ హితవు పలికారు. కార్యక్రమానికి విచ్చేసిన ఎంపీటీసీ బోశం రాం ప్రసాద్ కల్పించుకుని ఇరువురుని శాంతింపజేయడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

సంతోషిమాత ఆలయంలో కుంకుమ పూజలు


గోమాతకు పూజలు చేస్తున్న భక్తులు

మాడుగుల రూరల్: కె.జె.పురం జంక్షన్‌లో గల సంతోషిమాత ఆలయంలో శుక్రవారం ప్రత్యేక కుంకుమ పూజలు, అభిషేకాలు, నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఆలయం వద్ద గోమాతకు పూజలు చేశారు. అనంతరం అన్న సమారాధన జరిపారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కొళ్ల అమ్మతల్లినాయుడు పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు జరిగాయి. భక్తులకు గ్రామం నుంచి ఉచిత రవాణా సౌకర్యం వేగి రాము సహకారంతో ఏర్పాటు చేశారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న వార్డు మెంబర్ కనకదుర్గ

మాడుగుల: స్థానిక 13వ వార్డులో రూ.3లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణానికి శుక్రవారం వార్డు మెంబర్ నాగోజి కనక దుర్గ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కుక్కర మహేశ్వరి, వార్డు మెంబర్ జవ్వాది వరహాలు, వైఎస్సార్‌సీపీ నాయకులు కుక్కర శ్రీధర్, సయ్యపురెడ్డి సత్తిబాబు, శీలా మంతులు వాసు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు

గొలుగొండ: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో పీఆర్‌టీయూ నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం చురుగ్గా సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పీఆర్‌టీయూ అధ్యక్షుడు గోపీనాథ్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడేందుకు పీఆర్‌టీయూ బలోపేతం కా వాలన్నారు. మళ్లీ గాదె శ్రీనివాసులనాయుడును ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపించుకోవాలని కోరారు. పీఆర్‌టీయూ యూనియన్ నాయకులు గోవింద్, శ్రీరామూర్తి, రమణమూర్తి,రామకృష్ణ,సంబరాజుపాల్గొన్నారు.

కోకో సాగు ద్వారా అధిక ఆదాయం


రైతులకు అవగాహన కల్పిస్తున్న, ఎంహెచ్‌వో

మాడుగుల రూరల్: కోకో సాగు ద్వారా అధిక ఆదాయం పొందవచ్చని మండల ఉద్యానవన శాఖాధికారి వి.భానుపుష్పలీలావతి తెలిపారు. తాటిపర్తిలో శుక్రవారం కోకో పంట సాగు, యాజమాన్య పద్ధతులపై గిరి రైతులకు అవగాహన కల్పించారు. కోకో పంటను అంతర పంటగా వేసుకోవచ్చని, ప్రధానంగా పామాయిల్, ఇతర పంటల్లో అంతర పంటగా వేసుకోవడం వల్ల అధిక లాభాలు సాధించవచ్చన్నారు. కోకో సూపర్‌వైజర్ సిద్ధార్థ, స్థానిక వీహెచ్‌ఏ బి.అలేఖ్య, శంకరం పాల్గొన్నారు.

భారీగా అన్నసమారాధన

మాకవరపాలెం: స్థానిక బీసీ కాలనీలో దుర్గామల్లేశ్వరస్వామి ఆలయం వద్ద శుక్రవారం భారీ ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు.

నట్టల మందుతో నష్ట నివారణ

జీవాల్లో నట్టల బెడద సర్వసాధారణం. నేలకు దగ్గరగా మేత మేయడం, కలుషిత నీటిని తాగడం వల్ల ఈ సమస్య ఉత్పన్నమవుతుంది. మేత లభ్యం కానప్పుడు, పోషకాల లోపం ఏర్పడినప్పుడు, వానాకాలం, అనావృష్టి సందర్భాలు, అంటు వ్యాధులు ప్రబలిన సమయాల్లో ఈ పరాన్న జీవుల బెడద అధికంగా ఉంటుంది. ఇవి శరీరం, కాలేయం, ఊపిరితిత్తులు, పేగులు, జీర్ణాశయంలో స్థావరాలు ఏర్పాటు చేసుకుంటాయి. వీటి వల్ల జీవాలు మృతి చెందే పరిస్థితులు ఏర్పడతాయి. ఈ సమస్యలు రాకుండా జీవాల్లో రోగ నిరోధక శక్తి పెంచడమే లక్ష్యంగా పశుసంవర్ధక శాఖ నట్టల నివారణ మందు పంపిణీ చేపట్టింది.


గొర్రెలు, మేకలకు వేసేందుకు సిద్ధం చేసిన నట్టల నివారణ మందు

- మందుతో జీవాల్లో రోగ నిరోధకశక్తి పెంపు
- 16 నుంచి 31 వరకూ పంపిణీ


పిండ్రంగిలో అవగాహన కల్పిస్తున్న పశువైద్యాధికారి నాయుడు


కె.కోటపాడులో నట్టల నివారణ మందును వేసే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఏడీ దినేష్‌కుమార్

కె.కోటపాడు : కడుపులో ఉన్న ఏలిక పాముల వల్ల గొర్రెలు, మేకలు నీరసించిపోవడం, కడుపు ఉబ్బడం, గడబవాపు సోకడం, వ్యాధినిరోధక శక్తి తగ్గే పరిస్థితి కలుగుతుంది. దీని వల్ల అవి వ్యాధుల బారిన పడుతున్నాయి. వీటితో పాటు చూడికట్టే శాతం కూడా తగ్గే పరిస్థితులుంటాయని పశువైద్య సిబ్బంది చెబుతున్నారు. వ్యాధులు రాకుండా జిల్లాలో 3.42 లక్షల జీవాలకు నట్టల నివారణ మందు పంపిణీకి ఏర్పాట్లుచేశారు. కె.కోటపాడు పశుసంవర్ధకశాఖ పరిధిలో గల కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల్లో 33,500 గొర్రెలు, మేకలకు మందు వేయనున్నారు.

జిల్లాలో అన్ని పశువైద్య కేంద్రాలు, రైతు సేవా కేంద్రాల్లో గల పశువైద్య సహాయకులచే గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు పంపిణీ చేసే కార్యక్రమం చేపట్టారు. జిల్లాలో 3.42 లక్షల గొర్రెలు, మేకలకు మందు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ నెల 16 నుంచి 31 మందును వేసే కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ రెండు రోజుల్లో సుమారు 40 వేల గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందును వేసినట్లు పశువైద్యాధికారులు తెలిపారు.

రెండు నెలల వయస్సు దాటిన వాటికి..

రెండు నెలల వయస్సు దాటిన గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందును వేస్తున్నారు. గొర్రెలు, మేకలు వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు పశుసంవర్ధకశాఖ ఏడాదికి రెండు సార్లు ఉచితంగా ఈ మందును వేస్తోంది.

మందు తప్పకుండా వేయించాలి



గొర్రెలు, మేకల పెంపకం దారులు తప్పనిసరిగా నట్టల నివారణ మందును వేయించాలి. దీని వల్ల జీవాల కడుపులో ఉన్న ఏలిక పాములు నశిస్తాయి. తద్వారా గొర్రెలు, మేకలకు మంచి ఆరోగ్యం కలుగుతుంది. కె.కోటపాడు పశుసంవర్ధకశాఖ పరిధిలో కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల్లో రెండు రోజుల వ్యవధిలోనే 2,800 గొర్రెలు, మేకలకు మందు వేశాం. ఈ నెల 31కి రెండు మండలాల్లో 33,500 గొర్రెలు, మేకలకు మందును వేయాలన్న లక్ష్యంతో పని చేస్తున్నాం. అన్ని రైతు సేవాకేంద్రాల్లోను, పశువైద్య కేంద్రాల్లోను మందు అందుబాటులో ఉంది.

– దినేష్‌కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్, పశుసంవర్ధకశాఖ, కె.కోటపాడు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిలుపుదల చేయాలి


ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

నర్సీపట్నం: విద్యుత్ భారాలను తగ్గించడంతో పాటు స్మార్ట్ మీటర్ల అమర్చడం విరమించుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు డిమాండ్ చేశారు. ఏపీఈపీడీసీఎల్ డివిజనల్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిలుపుదల చేయాలని కోరుతూ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామకృష్ణారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ప్రభుత్వం రూ.20 వేల కోట్ల భారాన్ని విద్యుత్ వినియోగదారులపై మోపిందన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విద్యుత్ చట్టంలో భాగంగా స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నారని చెప్పారు. ముందుగా వాణిజ్య సముదాయాలు, ప్రభుత్వ కార్యాలయాలకు అమర్చిన తరువాత ఇళ్లకు అమర్చాలన్నది ప్రభుత్వ ఆలోచనని తెలిపారు. ఈ విధానాన్ని సీపీఎం తీవ్రంగా వ్యతిరేకిస్తోందని చెప్పారు. ఎన్నికల ముందు టీడీపీ, జనసేన నాయకులు విద్యుత్ చార్జీలపై విమర్శలు చేసి, అధికారం చేపట్టాక మర్చిపోయారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కె.వి.సూర్యప్రభ, ఈరెల్లి చిరంజీవి, టి.ఈశ్వరరావు, శివ, అనిల్, గీతాకృష్ణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే లక్ష్యసాధన సాధ్యం

సీఐ రేవతమ్మ


విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న సీఐ రేవతమ్మ

నర్సీపట్నం: విద్యతోనే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చునని నర్సీపట్నం రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ తెలిపారు. రూరల్ పోలీసులు నర్సీపట్నం మండలం వేములపూడి జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు కెరియర్ గైడెన్స్, సైబర్ నేరాలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ జీవితంలో స్థిరపడాలంటే విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని ఏర్పర్చుకుని, దానికి సాధించేందుకు కష్టపడి చదవాలన్నారు. చదువుతో పాటు క్రమశిక్షణ చాలా అవసరమని చెప్పారు. చదువు, క్రమశిక్షణ కలిగిన విద్యార్థులు ఏరంగంలోనైనా రాణిస్తారన్నారు. ఇటీవల కాలంలో సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని చెప్పారు. సైబర్ నేరాల వల్ల జరిగే అనర్థాలపై కుటుంబ సభ్యులకు విద్యార్థులు అవగాహన కల్పించాలన్నారు.

పశుపోషణలో జాగ్రత్తలు పాటించాలి


పాడి రైతులకు మినరల్ మిక్చర్ ప్యాకెట్‌లను అందజేస్తున్న పశువైద్యాధికారి నాయుడు

కె.కోటపాడు : పాడి రైతులు వర్షాకాలంలో పశుపోషణలో జాగ్రత్తలను పాటించాలని కొరువాడ పశువైద్యాధికారి సీహెచ్.వై.నాయుడు అన్నారు. మండలంలో కె.సంతపాలెంలో శుక్రవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. 29 పశువులకు గర్భకోశ చికిత్సలు, 19 పశువులకు సాధారణ వైద్యంతో పాటు 25 పెయ్యిలకు నట్టల నివారణ మందులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల్లో వ్యాధినిరోధక శక్తిని పెంచేందుకు మేతలో మినరల్ మిక్చర్(లవణ మిశ్రమం)ను వేసి ఆహారంగా అందించాలని సూచించారు. పశువులను పాడిగా ఉండే ప్రాంతాల్లో ఉంచాలని తెలిపారు. అనంతరం పాడి రైతులకు లవణ మిశ్రమం ప్యాకెట్లను ఉచితంగా అందించారు. మాజీ సర్పంచ్ చల్లా తులసి తదితరులు పాల్గొన్నారు.

నిలకడగా తాండవ నీటిమట్టం


తాండవ రిజర్వాయర్‌లో నీటి మట్టాన్ని పరిశీలిస్తున్న ప్రాజెక్టు డీఈ అనురాధ

నాతవరం: తాండవ రిజర్వాయర్ నీటి మట్టం నిలకడగా ఉందని తాండవ ప్రాజెక్టు డీఈ అనురాధ తెలిపారు. తాండవ రిజర్వాయర్ నీటి మట్టాన్ని శుక్రవారం ఆమె పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాల కారణంగా తాండవ ప్రాజెక్టులో నీటి మట్టం భారీగా పెరిగిందని, దీంతో భయాందోళన చెందామన్నారు. ఎగువ ప్రాంతం నుంచి ఇన్‌ఫ్లో తగ్గడంతో ప్రస్తుతం నీటిమట్టం నిలకడగా ఉందన్నారు. రిజర్వాయర్ నుంచి ప్రధాన కాలువల ద్వారా ఆయకట్టు భూములకు రోజు 555 క్యూసెక్కుల చొప్పునవిడుదల చేస్తున్నట్టు చెప్పారు. శుక్రవారం సాయంత్రానికి ప్రాజెక్టులో 377.0 అడుగుల నీటి మట్టం ఉందన్నారు.

‘పెద్దేరు’ తగ్గుముఖం

మాడుగుల: మండలంలో అధిక జలవనరులు గల పెద్దేరు జలాశయం నీటి మట్టం తగ్గుముఖం పట్టింది. జలాశయం గరిష్ట నీటి మట్టం 137 మీటర్లు కాగా ప్రస్తుతం 136. 40 మీటర్లకు చేరింది. ప్రస్తుతం జలాశయంలోకి 140 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరడంతో అంతే నీరు విడుదల చేస్తున్నారు.

ఓటు హక్కు వజ్రాయుధం


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్

చోడవరం రూరల్: ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఎన్నుకోవడానికి వినియోగించవచ్చని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.కిరణ్ కుమార్ అన్నారు. శుక్రవారం కళాశాల ఎన్ఎస్ఎస్ మూడు యూనిట్లు, స్వీప్ రెవెన్యూ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ఓటు హక్కు నమోదుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యార్థులు ఓటు హక్కు పొందే అర్హత వయస్సును కలిగి ఉంటారని, వారంతా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లలో ఓటరుగా నమోదు కావచ్చన్నారు. ఎస్వీఈఈపీ ప్రతినిధులు మాట్లాడుతూ ఓటు నమోదును రెండు విధానాల్లో చేసుకోవచ్చన్నారు. దీని కోసం బర్త్ సర్టిఫికెట్, ఆధార్ నివాస పత్రాలను జత చేయాల్సి ఉంటుందని తెలిపారు. స్వీప్ ఓటరు నమోదు అంబాసిడర్‌గా గాయత్రీ కళాశాల బీఎస్సీ విద్యార్థినిని నియమించినట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డి.మాల్యాద్రి, సీనియర్ ఉపన్యాసకులు వి.అప్పలనాయుడు, ఎస్.ఎం.రఫీయుద్దీన్, ఐ.వి.వి.సత్యవతి, హెచ్.సుధీర్, జ్యోతి, సూర్యవతి, లక్ష్మీ మంగమ్మ, కృష్ణారావు, జి.నారాయణరావు, జి.వెంకటేష్, పీడీ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు


జి.అగ్రహారంలో అర్జీలు అందజేస్తున్న రైతులు


చినమదీనలో సమస్యలు వింటున్న తహసీల్దార్


పల్లపుకోడాబు గ్రామ సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ లక్ష్మీదేవి


పెద్దిపాలెంలో రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు


చినజగ్గంపేట గ్రామ సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ వేణుగోపాల్

మాడుగుల రూరల్: భూ సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ కె.రమాదేవి తెలిపారు. జి.అగ్రహారంలో శుక్రవారం జరిగిన రెవెన్యూ గ్రామ సభలో ఆమె మాట్లాడారు. గతంలో చేసిన భూ సర్వేలో లోపాలుంటే గ్రామ సభల ద్వారా సరిచేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా 8 అర్జీలు వచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ జగదీష్, రీసర్వే డీటీ గణపతి, సర్పంచ్ నందారపు మంగమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు ఆర్లె మాధవి తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి: రెవెన్యూ గ్రామ సభల్లో ప్రజల నుంచి స్వీరించే అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యత కల్పిస్తామని దేవరాపల్లి తహసీల్దార్ పి.లక్ష్మీదేవి తెలిపారు. తామరబ్బ పంచాయతీ పరిధిలోని పల్లపుకోడాబులో సర్పంచ్ టోకురి రామకృష్ణ అధ్యక్షతన శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సభలో ఆమె మాట్లాడుతూ రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో భూ సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా గ్రామ సభలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అనంతరం అర్జీలను స్వీకరించారు. మండల సర్వేయర్ గోవిందరాజులు, వీఆర్‌వో దేముడమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోలుగుంట: మండలంలోని గంగవరంలో శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సభలో గతంలో జరిగిన సమగ్ర భూసర్వేలో రైతులకు తలెత్తిన సమస్యల గురించి డిప్యూటీ తహసీల్దార్ శంకరరావు తెలుసుకున్నారు. రైతుల నుంచి వినతులు స్వీకరించారు. ఆర్ఐ రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట: గతంలో జరిగిన భూ సర్వేలో రైతులకు ఎటువంటి సమస్యలొచ్చిన గ్రామ సభల దృష్టికి తెచ్చి పరిష్కారం పొందాలని తహసీల్దార్ ఎం.లక్ష్మి తెలిపారు. శుక్రవారం చినమదీనలో జరిగిన గ్రామ సభలో ఆమె మాట్లాడారు. గతంలో జరిగిన శాశ్వత భూ హక్కు సర్వేలో తక్కువ భూమిగా నమోదైనా, సర్వే నంబర్లు, పేర్లలో తప్పులు దొర్లినా గ్రామ సభ దృష్టికి తీసికొస్తే 15 నుంచి 30 రోజుల్లోగా సమస్య పరిష్కరిస్తామని చెప్పారు. పలువురు రైతుల నుంచి భూ సమస్యలపై అర్జీలను స్వీకరించారు. సర్పంచ్ గోవింద,ఆర్ఐ,వీఆర్వోలు సిబ్బంది పాల్గొన్నారు.

మాకవరపాలెం: రీ సర్వేలో దొర్లిన తప్పులను సరిచేసేందుకే రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు డిప్యూటీ తహసీల్దార్ సోమశేఖర్ తెలిపారు. మండలంలోని పెద్దిపాలెంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్న రైతులు తమ సమస్యలపై అధికారులకు అర్జీలు అందజేశారు. 52 దరఖాస్తులు అందాయని రీ సర్వే డీటీ కృష్ణమూర్తి తెలిపారు. సకాలంలో ఈ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ జెట్టి, వీఆర్వో సూర్యకుమారి పాల్గొన్నారు.

నాతవరం: భూ రీసర్వేలో జరిగిన లోపాలను సరిచేసేందుకే గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ ఎ.వేణుగోపాల్ తెలిపారు. నాతవరం పంచాయతీ శివారు చినజగ్గంపేటలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. రీసర్వేలో పొరపాట్లు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. 14మంది రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ శివ, మండల సర్వేయరు ప్రసాద్ పాల్గొన్నారు.

అభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర కీలకం


మాట్లాడుతున్న ఎంపీడీవో సాంబశివరావు


శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న బుల్లిలక్ష్మి

కె.కోటపాడు: గ్రామ పంచాయతీల అభివృద్ధిలో వార్డుసభ్యుల పాత్ర కీలకమని ఎంపీడీవో ఎ.ఎ.సాంబశివరావు అన్నారు. కె.కోటపాడు వెలుగు కార్యాలయంలో నిర్వహిస్తున్న వార్డు సభ్యుల శిక్షణ కార్యక్రమాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఏపీ పంచాయతీ రాజ్ చట్టంలో గల 10 అంశాలపై వార్డు సభ్యులకు శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ ఎస్.అప్పలరాజు, ఈవోఆర్డీ రమణి పాల్గొన్నారు.

దేవరాపల్లి: గ్రామాభివృద్ధిలో వార్డు మెంబర్లు కీలక పాత్ర పోషించాలని దేవరాపల్లి ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉప సర్పంచ్, వార్డు మెంబర్లకు రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ మాట్లాడుతూ గ్రామ పరిపాలన, నిధులు, ఆదాయ వనరులు, మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై వార్డు మెంబర్లు పట్టు సాధించాలన్నారు. అనంతరం ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కె.వి.రమణ మాట్లాడుతూ గ్రామ సభ ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.వి. సువర్ణరాజు, పరిపాలన అధికారి డి.వి.లక్ష్మీనారాయణ, ఇంచార్జ్ ఈవోపీఆర్డీ జామి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు వేధిస్తున్నారంటూ ఆర్డీవోకు వినతి


ఆర్డీవో వి.వి.రమణకు వినతిపత్రం అందజేస్తున్న అమ్మపేట గ్రామస్తులు

నర్సీపట్నం:కొన్నేళ్లుగా అనుభవంలో స్థలాల నుంచి తమను వెళ్లగొట్టేందుకు భయభ్రాంతులకు గురి చేస్తున్న రెవెన్యూ అధికారులు, పోలీసుల నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ గొలుగొండ మండలం, అమ్మపేట గ్రామానికి చెందిన టి.నానిబాబు, రమణ, జి.రమాకృష్ణ, ఎం.రమణ, ఈగల బాబులు, పోలుపర్తి సత్తిబాబు, పి.అర్జున్, పి.రమణ, పెదబాబులు, ఇ.గణేష్, టి.లక్ష్మి, చావా చిన్నఅచ్చీలు, ఇ.సత్యనారాయణ, ఎ.శివ, నక్క లోవరాజు, బి.ఎ.రాజు, ఎం.సత్యనారాయణ, జి.రమణ, సి.అప్పలనాయుడు తదితరులు వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ విభాగం నాయకులు మాకిరెడ్డి బుల్లిదొర ఆధ్వర్యంలో ఆర్డీవో వి.వి.రమణను కలిసి మొరపెట్టుకున్నారు. పరిశీలన చేస్తానని ఆర్డీవో హామీ ఇచ్చారు. సర్వే నంబరు 17, 18లో స్థలాలను తామంతా అనుభవిస్తున్నామని, మాలో కొంత మందికి ఎల్‌పీసీలు ఇచ్చారని, కొంత మంది వారసత్వం ద్వారా అనుభవిస్తున్నామని వినతిపత్రంలో పేర్కొన్నారు. మా గ్రామ సర్పంచ్ రాజకీయంగా తమను ఇబ్బంది పెట్టాలనే దురుద్దేశంతో రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చారని ఆరోపించారు. కనీసం మాకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది బలవంతంగా తమ ఇళ్లు, కల్లాలోకి చొరబడి సర్వే చేస్తున్నారని ఆర్డీవో దృష్టికి తీసుకువెళ్లారు. అడ్డుకునే ప్రయత్నం చేస్తే గొలుగొండ పోలీసులు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన చెందారు. తమకు న్యాయం చేయాలని ఆర్డీవోను కోరారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు


పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులు

గొలుగొండ: సీహెచ్ నాగాపురంలో శుక్రవారం పారిశుధ్య పనులు నిర్వహించారు. సర్పంచ్ యలమంచిలి రఘురాం ఆధ్వర్యంలో ఈ పనులు చేపట్టారు. వీధుల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించడంతో పాటు తాగునీటి కుళాయిలు, నీటి పథకాల వద్ద శుభ్రం చేశారు.

గోపాలమిత్రుల సమస్యల పరిష్కారానికి విజ్ఞప్తి


రాష్ట్రపశుసంవర్ధకశాఖ సంచాలకులు దామోదర నాయుడుకు సమస్యలు వివరిస్తున్న వెంకటరమణ

నాతవరం: రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న గోపాలమిత్రుల సమస్యలను పరిష్కరించి, ఆదుకోవాలని గోపాలమిత్రల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిల్లాడ వెంకటరమణ కోరారు. విజయవాడలో శుక్రవారం రాష్ట్ర పశుసంవర్ధకశాఖ సంచాలకులు టి.దామోదర్ నాయుడును కలిసి ఆయన వినతి పత్రం ఇచ్చారు. ఈసందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ పాడి రైతులకు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి పలు రకాలు సేవలు అందిస్తున్న గోపాలమిత్రులకు సరైన గుర్తింపు లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది గోపాలమిత్రులు పని చేస్తున్నారని, ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. గోపాలమిత్రులు సమస్యలపై జిల్లాల వారీగా నివేదిక తయారీ చేసి రాష్ట్ర పశుసంవర్ధకశాఖ సంచాలకులకు అందజేసినట్టు చెప్పారు.